రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యా రాణిని సోమవారం సాలూరులో మర్యాద పూర్వకంగా జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ కలిశారు.

– ప్రజాశక్తి,సాలూరు

ఎత్తిపోతల పథకం మంజూరు చేస్తా : మంత్రి

ప్రజాశక్తి – సాలూరురూరల్

మండలంలోని పెదపదం, నార్లవలస, పారన్నవలస, కుర్మరాజుపేట పంచాయతీల రైతుల ఎన్నో దశాబ్దాల కల అయిన సువర్ణముఖి నదిపై ఎత్తిపోతల పథకం మంజూరు చేయిస్తానని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి తెలిపారు. సోమవారం ఆమెను తన నివాసంలో పెదపదం, నార్లవలస కూర్మరాజుపేట పారన్నవలస రైతులు కలిసి ఎన్నో ఏళ్లగా సువర్ణముఖి నదిపై ఎత్తిపోతల పథకం మంజూరు చేయాలని కోరుతూ వినతిని అందజేశారు. ఎత్తిపోతల పథకం మంజూరైనట్టయితే ఈ ప్రాంత రైతులకు సుమారు వెయ్యి ఎకరాలకు సాగునీరందుతుందని, దీంతో ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని అన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వంలో నీటిపారుదల శాఖ అధికారులు సర్వే చేశారని, అప్పటి ఐటిడిఎ అధికారులు కూడా దీని అమలుకు వీలుంటుందని, తొందరల్లోనే దీన్ని చేసి పెడతామని హామీ ఇచ్చారన్నారు. అప్పటి అధికారులు కూడా ఉన్నతాధికారులకు నివేదికలు అందజేశారని పేర్కొన్నారు. అదే సమయంలో ప్రభుత్వం మారడంతో దీన్ని నిర్లక్ష్యం చేశారన్నారు. ఇప్పుడు టిడిపి అధికారంలోకి వచ్చిందని, ఆనాడు దీని గురించి టిడిపియే ముందుండి నడిపించిందని, మళ్లీ ఇప్పుడు ఈ ప్రభుత్వం రావడంతో ఈ పథకాన్ని తప్పకుండా మంజూరు చేయిస్తానని రైతులకు మంత్రి హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో మండల టిడిపి అధ్యక్షుడు ఆముదాల పరమేష్, మాజీ సర్పంచ్ మత్స భాస్కరరావు, మరిపి సింహాచలం, అక్యాన తిరుపతిరావు, చొక్కాపు తిరుపతి రావు, రైతులు పాల్గొన్నారు

మంత్రి సంధ్యారాణికి వినతిని అందజేస్తున్న రైతులు

మంత్రికి అంగన్వాడీల వినతి

సాలూరు : గిరిజన సంక్షేమ, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణిని బాడంగి ఐసిడిఎస్ ప్రాజెక్టు అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. సోమవారం ఆమె నివాసంలో కలిసి సమస్యల్ని వివరించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెంచిన వేతనాలు అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు రమణమ్మ,లక్ష్మి,సత్యవతి, సిఐటియు శ్రీను, సురేష్ పాల్గొన్నారు.

మంత్రి ని కలిసిన ఫీడర్ అంబులెన్స్ ఉద్యోగులు

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మన్యం జిల్లాలో గల ఫీడర్ 108 అంబులెన్స్ ఉద్యోగులు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణిని కలిసి వినతిపత్రం అందజేశారు. 2018లో అప్పటి సిఎం చంద్రబాబు నాయుడు ఫీడర్ అంబులెన్స్‌లను ప్రవేశపెట్టారని చెప్పారు. గిరిశిఖర గ్రామాల నుంచి గర్భిణులను సురక్షితంగా ఆసుపత్రికి తీసుకు రావాలనే ఉద్దేశంతో ఈ అంబులెన్స్‌లను ప్రవేశపెట్టారని చెప్పారు. గత ప్రభుత్వం తమను తీవ్ర నిర్లక్ష్యం చేసిందని తెలిపారు. ఎదుగూ బొదుగూ లేని జీతాలతో ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్నామని చెప్పారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం కనీస వేతనం 26వేలు చెల్లించాలని కోరారు. దీనిపై మంత్రి సంధ్యారాణి మాట్లాడుతూ కొత్త ఫీడర్ అంబులెన్స్ లు తీసుకొచ్చేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని చెప్పారు. జీతాల పెంపుపై ప్రభుత్వం సరైన సమయంలో నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు.

లక్ష్యాలు సాధించాలి : కలెక్టర్

ప్రజాశక్తి – పార్వతీపురంరూరల్

జిల్లా అధికారులు, సిబ్బంది అంతా శ్రద్ధతో పనిచేసి, లక్ష్యాలను సాధించాలని ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. సోమవారం ప్రజా ఫిర్యాదులు పరిష్కార వేదికలో ఆయన అధికారులను ఉద్దేశించి మాట్లాడారు. శ్రద్ధ, అంకిత భావంతో పనిచేసి జిల్లాను ఉన్నత స్థానంలో నిలపాలని అన్నారు. ఎటువంటి నిర్లక్ష్యాన్ని సహించేది లేదనిస్పష్టం చేశారు. పనిచేద్దాం – లక్ష్యాలు సాధిద్దాం అన్నారు. ప్రాథమిక, ఇంజినీరింగ్ రంగాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని చెప్పారు. ప్రభుత్వ ప్రాధాన్యత అంశాలు, జిల్లాలో దృష్టి సారించాల్సిన అంశాలపై శ్రద్ధ వహించాలని సూచించారు. జిల్లాలో మలేరియా వంటి వ్యాధులు ప్రభలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 15రోజుల పాటు పారిశుధ్య డ్రైవ్ నిర్వహించాలని ఆదేశించారు.

పారిశుధ్య డ్రైవ్‌లో భాగంగా అంటువ్యాధులపై అవగాహన కల్పించడం, సంబంధిత కరపత్రాలను పంపిణీ చేయడం వంటి చర్యలు చేపట్టాలని జిల్లా మలేరియా అధికారిని ఆదేశించారు. వసతి గృహాలు, విద్యా సంస్థలు పరిశుభ్రంగా ఉండాలని స్పష్టం చేశారు. చిన్నారుల్లో ప్రవర్తనా, సామాజిక, ఆలోచనా పరంగా మార్పులు తీసుకురావడానికి చర్యలు దోహదం చేయాలని సూచించారు. చేతుల శుభ్రతపై సరైన శిక్షణ ఉండాలని, ప్రతి రోజూ ఆచరించాలని చెప్పారు. మధ్యాహ్న భోజన పథకం కింద ఆహారం తీసుకున్న తర్వాత అక్కడే మిగిలిన అన్నం పారబోస్తున్నారన్నారు. వసతి గృహాల్లో సైతం పడుకునే గదిలోనే తినడం, అక్కడే ఆహార పదార్థాలను వదలడం, శుభ్రత లేకపోవడం, బయట అన్నం పారబోయాడం గమనించామని చెప్పారు. ఇటువంటి అంశాలను తీవ్రంగా పరిగణించి జిల్లా సంక్షేమ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వసతి గృహాల్లోని పిల్లల్లి మన పిల్లలుగా చూడాలని, తద్వారా పరిస్థితులు అవగాహన కలుగుతుందని ఆయన అన్నారు. మన్యం జిల్లా ఆదర్శప్రాయంగా ఉండేందుకు కృషి చేయాలని చెప్పారు. సమావేశంలో ఐటిడిఎ పిఒ సి.విష్ణు చరణ్, ఇన్ ఛార్జ్ డిఆర్ఒ జి.కేశవ నాయుడు, ఆర్‌డిఒ కె.హేమలత, అన్నిశాఖల జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

170 దరఖాస్తులు

ప్రతి సమస్యను సత్వరం పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ప్రజలు చాలా దూరం నుంచి తమ సమస్యలను చెప్పుకోవడానికి వస్తున్నారని, ప్రజల సమస్యలు పరిష్కరించేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి, ప్రతి దరఖాస్తుదారుని సమస్యకు పరిష్కారం చూపించాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. కలెక్టర్‌తో పాటు ఐటిడిఎ పిఒ, డిఆర్ఒ, ఆర్‌డిఒ ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 170 దరఖాస్తులు అందాయి. ఈ కార్యక్రమంలో అన్నిశాఖల జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

కలెక్టర్‌ను కలిసిన ఎస్‌పి, అధికారులు

కొత్తగా జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌ను ఎస్‌పి విక్రాంత్ పాటిల్ సోమవారం మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. అలాగే పాలకొండ మాజీ ఎమ్మెల్యే వి.కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ కలిసి అభినందనలు తెలిపారు. అలాగే వివిధశాఖల అధికారులు కూడా కలెక్టర్‌ను కలిశారు.

ఎమ్మెల్యే జగదీశ్వరి దంపతులను సత్కరిస్తున్న వీరేష్‌చంద్రదేవ్, నాయకులు

ఘనంగా ఎమ్మెల్యే జగదీశ్వరి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి – గుమ్మలక్ష్మీపురం

కురుపాం నియోజకవర్గ ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి జన్మదిన వేడుకలను గుమ్మలక్ష్మీపురంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గుమ్మలక్ష్మీపురం, కురుపాం, జియమ్మవలస, గరుగుబిల్లి, కొమరాడ మండలానికి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ఉద్యోగులు, స్నేహితులు పెద్ద సంఖ్యలో వచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

ఎమ్మెల్యేకు వీరేష్ చంద్ర దేవ్ జన్మదిన శుభాకాంక్షలు

కురుపాం : స్థానిక ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి జన్మదినాన్ని పురస్కరించుకొని టిడిపి రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేశ్ చంద్రదేవ్ సోమవారం గుమ్మలక్ష్మీపురం బిఎస్ఆర్ కళ్యాణ మండపంలో ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు జరుపుకున్న వేదిక వద్దకు వెళ్లి పుష్పగుచ్చం అందజేసి దుస్సాలువా కప్పి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ, అరుకు పార్లమెంట్ ఎస్టీ సెల్ అధికార ప్రతినిధి నందివాడ కృష్ణబాబు, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి కోలా రంజిత్ కుమార్, జనసేన నియోజకవర్గం కన్వీనర్ కడ్రక మల్లేశ్వరరావు, టిఎన్ఎస్ఎఫ్ మీడియా కోఆర్డినేటర్ సుకేష్ చంద్ర పండా, జనసేన, టిడిపి నాయకులు చందక రామకృష్ణ, కర్రి శ్రీను, కురుపాం నియోజకవర్గ జనసేన ఇన్చార్జి కె.మల్లేష్, నాయకులు నేరడుబిల్లి వంశీ, ఐదు మండలాల టిడిపి కన్వీనర్లు, కార్యదర్శిలు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు చేపట్టండి : ఎంపిడిఒ

ప్రజాశక్తి – పాలకొండ

గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలని ఎంపిడిఒ రామకృష్ణ అన్నారు. సోమవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంద రోజులు పాటు పారిశుధ్య పనులు సక్రమంగా చేపట్టాలని అన్నారు. తాగునీటి సమస్యలు లేకుండా చూడాలని అన్నారు. గ్రామాల్లో కాలువల ఫోటోలను అప్–లోడ్ చేయాలన్నారు

గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో

మౌలిక వసతులు కల్పించాలి

ప్రజాశక్తి – సాలూరురూరల్

జిల్లాలోని గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని ఆదివాసీ గిరిజన సంఘం గౌరవ అధ్యక్షులు సీదరపు అప్పారావు డిమాండ్ చేశారు. మండలంలోని కురుకూటి, మావుడి గిరిజన ఆశ్రమ పాఠశాలలను ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు సోమవారం పరిశీలించారు. పరిశీలన అనంతరం అప్పారావు మాట్లాడుతూ కూరుకుట్టి, మావుడి ఆశ్రమ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, ఎఎన్ఎం, నైట్ వాచ్ మెన్ పోస్టులను భర్తీ చేయాలని, ఆశ్రమ పాఠశాల విద్యార్థుల సంఖ్యకు సరిపడా సౌకర్యాల్లేనట్టు గురించామన్నారు. ఉన్న పాఠశాల భవనాలు సరిపోక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారన్నారు. కావున విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టు భవన నిర్మాణాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. మామిడి ఆశ్రమ పాఠశాలలో కనీసం వంట గదుల్లేక రేకుల షెడ్ల్లో వంట చేస్తున్నారన్నారు. అన్ని తరగతులకు సరిపడా సబ్జెక్టు ఉపాధ్యాయుల్లేరని, వెంటనే ఉపాధ్యాయులను నియమించాలని డిమాండ్ చేశారు. కురుకుట్టి, మావుడి ఆశ్రమ పాఠశాలలకు నైట్ వాచ్మెన్లు లేక పిల్లలు ఇబ్బందిపడుతున్న పరిస్థితి ఉందన్నారు. బయట నుంచి వ్యక్తులు రాత్రిపూట పాఠశాలలోకి వచ్చి ఇబ్బందులు పెడుతున్నారని, కావున నైట్ వాచ్మెన్ పోస్టులను భర్తీ చేసి పిల్లలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. జ్వరం వస్తే కనీసం మందులు ఇవ్వడానికి స్థానికంగా ఉన్న ఆసుపత్రికి తీసుకెళ్లడానికి ఎఎన్ఎం లేకపోవడంతో సకాలంలో పిల్లలకు అనారోగ్య సమస్య వచ్చినప్పుడు వైద్యం అందడం లేదని తెలిపారు. ఎఎన్ఎం పోస్టులను ఆశ్రమ పాఠశాలన్నింటిలో భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. వైద్యమందక గత ఏడాది ఆశ్రమ పాఠశాలలో పిల్లలు సుమారు 20 మంది వరకు చనిపోయారని గుర్తు చేశారు. ఇప్పటికైనా ఐటిడిఎ అధికారులు, జిల్లా కలెక్టర్, రాష్ట్ర ప్రభుత్వం చొరచూపి పిల్లల ఆరోగ్య విషయంలో పోస్టులను భర్తీ చేయాలని కోరారు. మావుడి ఆశ్రమ పాఠశాలలో ఉన్న రక్షిత ఫిల్టర్ వాటర్ ప్రాజెక్ట్ పాడై ఏడాది గడుస్తున్నా నేటికీ మరమ్మతులు చేయకపోవడం మంచినీళ్లు అందడం లేదని, దీన్ని వెంటనే మరమ్మతులు చేసి మంచినీళ్లు అందించాలని కోరారు. ఈ పరిశీలనలో ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్షులు వంతల సుందరరావు, కార్యదర్శి గెమ్మెల జానకిరావు, మండల కమిటీ సభ్యులు మెలిక అయోధ్య, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు జన్ని ఈశ్వరరావు, జిల్లా సహాయ కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు, చెడ్డ సీతారాం తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ గిరిజనసంఘం

కురుకూటి ఆశ్రమ పాఠశాలలో వాటర్‌ప్లాంట్‌ను పరిశీలిస్తున్న గిరిజన సంఘం నాయకులు

విద్యార్థిని కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న గిరిజన సంఘం నాయకులు

అధికారులు చర్యలు తీసుకోవాలి

సీతంపేట : గిరిజన విద్యార్థి మరణానికి కారణమైన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలో అచ్చబలో మలేరియాతో మృతి చెందిన బిడ్డక రస్మిత కుటుంబాన్ని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా నాయకులు బిడ్డక అప్పారావు, ఎం.తిరుపతిరావు, ఎ.భాస్కరరావు, వి.దుర్గారావు పరామర్శించారు. శ్రీకాకుళం జిల్లా వెన్నెలవలస గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఈ ఏడాదే మూడో తరగతిలో చేర్పించామని, మూడు రోజులు జ్వరంతో సరైన వైద్యమందక తన బిడ్డ చనిపోయిందని కుటుంబం సభ్యులు వాపోయారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మృతురాలి కుటుంబానికి ప్రభుత్వం రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియో చెల్లించి ఆదుకోవాలని, ఈ పరిస్థితికి కారణమైన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గతేడాది మండలంలోని పూతికవలస ఆశ్రమపాఠశాలలో భామిని మండలం ఇసకగూడ విద్యార్థి మలేరియా బారినపడి చనిపోయారు. డిడిలు సరైన పర్యవేక్షణ లేకపోవడం ఈ ఘటనలు జరుగుతున్నాయని అన్నారు. భవిష్యత్తు లో ఇటువంటి ఘటనలు జరగకుండా ఐటిడిఎ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఎస్‌పి కార్యాలయంలో

ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ప్రజాశక్తి – పార్వతీపురం రూరల్

జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి పోలీస్ కార్యాలయానికి వచ్చిన ప్రజల నుంచి ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఫిర్యాదులు స్వీకరించి, వారితో ముఖా ముఖి మాట్లాడి, సమస్యలను తెలుసుకున్నారు. పూర్తి స్థాయిలో పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. ఫిర్యాదుదారుల అర్జీలు, వారి వివరాలు సంబంధిత పోలీసు అధికారులకు తక్షణమే తెలియపర్చి చట్ట ప్రకారం చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని అధికారులను అదేశించారు. కార్యక్రమంలో 8 ఫిర్యాదులు అందాయి. ప్రతి సోమవారం జరిగే "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌పి సూచించారు. ఈ కార్యక్రమంలో డిసిఆర్‌బి సిఐ బిఎండి ప్రసాద్ రావు, సోషల్ మీడియా సైబర్ సెల్(ఇంచార్జ్ ఎస్పీ) సిఐ జి.దేముడు బాబు, డిసిఆర్‌బి ఎస్ఐ గోవిందరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎలాంటి విచారణకైనా సిద్ధం : రాజన్నదొర

ప్రజాశక్తి – సాలూరు

నియోజకవర్గంలో ఇళ్లు, ఇళ్ల స్థలాల కేటాయింపుపై విచారణ జరిపిస్తామని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి చెప్పడంపై మాజీ డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర స్పందించారు. తాను ఎలాంటి విచారణకైనా సిద్ధమేనన్నారు. తాను ఎమ్మెల్యేగా, మంత్రిగా ఎవర్నీ మోసగించలేదని, ఎవరి నుంచి లంచాలు తీసుకోలేదని చెప్పారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు నెలలు కాకముందే మన్యం జిల్లాలో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో ఇద్దరు విద్యార్థులు మరణించారని చెప్పారు. గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ఎఎన్ఎంల నియామకం తాను మంత్రిగా వున్నప్పుడే జరిగిందని చెప్పారు. పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రతిపక్షంలో ఉన్నామని భయపడాల్సిన అవసరం లేదని, కష్టసుఖాల్లో అండగా వుంటామని హామీ ఇచ్చారు.

జాబ్‌మేళాలో 150 మంది ఎంపిక

ప్రజాశక్తి – సాలూరు

స్థానిక ప్రభుత్వ ఐటిఐలో సోమవారం నిర్వహించిన జాబ్ కమ్ అప్రెంటిస్ మేళాలో 150 మంది విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ వి.రవికుమార్ చెప్పారు. ఎల్అండ్‌టి కంపెనీకి వంద మంది, విశాఖపట్నంలోని కంపెనీకి 50 మంది ఎంపికయ్యారని తెలిపారు. ఎంపికైన వారికి స్టైఫెండ్ కింద రూ.9వేల నుంచి రూ.12,500 ఇస్తారని, భోజనం, ఉచిత వసతి కల్పిస్తారని చెప్పారు.వారిని ప్రిన్సిపాల్ రవికుమార్, ప్లేస్ మెంట్ ఆఫీసర్ కె.శ్రీనివాసరావు అభినందించారు.

అర్బన్ హెల్త్ సెంటర్లో రెగ్యులర్ డాక్టర్‌ను నియమించాలి

ప్రజాశక్తి – పార్వతీపురం టౌన్

పట్టణ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లో (యుపిహెచ్‌సి) వైద్యులను నియమించాలని సిపిఎం పట్టణ కమిటీ నాయకులు గొర్లి వెంకటరమణ, బంకురు సూరిబాబు, సంచాన ఉమామహేశ్వరరావు అన్నారు. సోమవారం పట్టణంలో జగన్నాథపురంలో గల అర్బన్ హెల్త్ సెంటర్ వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, జగన్నాథపురం, బెలగాంలో రెండు యుపిహెచ్‌సి ఆసుపత్రుల్లో మందులు, సిబ్బంది ఉన్నారని, అయితే వైద్యులు లేకపోవడంతో వైద్యసేవలకు వచ్చే రోగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే వైద్యులను నియమించాలని డిమాండ్ చేశారు.

ఎరువుల దుకాణాలపై ఆకస్మిక దాడులు

ప్రజాశక్తి –జియ్యమ్మవలస

మండలంలోని చినమేరంగి అన్నపూర్ణ ఏజెన్సీ ఎరువులు షాపులో విజిలెన్స్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. సోమవారం కోనసీమ జిల్లాకు చెందిన విజిలెన్స్ స్క్వాడ్ ఎడిఎ ఎస్‌జెవి రామ్మోహన్రావు, విశాఖ జిల్లా విజిలెన్స్ సిఐ సిహెచ్ తిరుపతిరావు ఆధ్వర్యంలో ఈ తనిఖీలు నిర్వహించారు. ముందుగా షాపులోని ఎరువులు, పురుగు మందులు ధరల పట్టికను, రిజిస్టర్లను బిల్లు పుస్తకాలు, లైసెన్స్, ఇన్వాయిస్ మొదలైన రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం గోదాం లో ఉన్న ఎరువు నిల్వలను చూసి సంతప్తి చేశారు .కాలం చెల్లిన మందులను అమ్మినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎడిఎ నిర్మలాజ్యోతి, ఎఒ ఆర్ జి హర్షలత, రాజు ప్రియాంక పాల్గొన్నారు.

గరుగుబిల్లి : స్థానిక శ్రీ గాయత్రి ఎరువుల దుకాణంలో వ విజిలెన్స్ స్క్వాడ్ ఎడిఎ ఎస్‌జెవి రామ్మోహన్‌రావు, విజిలెన్స్ సిఐ తిరుపతిరావు రికార్డు, బిల్లుపుస్తకాలు, స్టాక్ రిజిష్టర్, పరిశీలించారు. గోడౌన్‌లో ఎరువుల నిల్వ తనిఖీ చేశారు. రికార్డులు సరిగ్గా నిర్వహించకపోవడం వల్ల 6464 మెట్రిక్ టన్నుల ఎరువులను సీజ్ చేశామని తెలిపారు. ఈ పరిశీలనలో ఎడిఎ ఎ.నిర్మల జ్యోతి, ఎఒ విజయభారతి పాల్గొన్నారు.

జియ్యమ్మవలసలో ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

గిరిజన గ్రామాలకు బోర్లు, రోడ్లు వేయాలి

ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ, ధర్నా

ప్రజాశక్తి – పార్వతీపురం టౌన్

కురుపాం మండలం బుడ్డిడిగూడ, తీయ్యాలగూడ, తాడిగండ, జలుబుగూడ, మామిడి మానుగూడ, చింతమానుగూడ, కొత్తూరుగూడ, కేదారిలంక తదితర గ్రామాలకు మంచినీటి సౌకర్యం కల్పించాలని, రోడ్లు వేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం స్థానిక సుందరయ్య భవన్ నుంచి ర్యాలీగా వెళ్లి కలెక్టర్ కార్యాలయం వద్ద గిరిజన సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం జిల్లా నాయికులు ఎం.శ్రీనివాసరావు, అడ్డమేశ్వరావు మాట్లాడుతూ కురుపాం, గుమ్మలక్ష్మి పురం మండలాల గిరిజనులకు మంచినీటి సౌకర్యం నేటికీ కల్పించకపోవడంతో గిరిజనులు గెడ్డలు, వాగులు, వంకల నీరు తాగుతున్నారని తెలిపారు. దీనివల్ల మలేరియా, డయేరియా, టైఫాయిడ్ వంటి జ్వరాల బారినపడుతారని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే పై గిరిజన గ్రామాలకు రోడ్డు సౌకర్యం కూడా లేదని, ఎవరికైనా ఆరోగ్యం బాగోక పోతే డోలీలతో కిందికి తీసుకురావాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఇప్పటికైనా గిరిజనులకు మంచి నీరు, రోడ్లు సౌకర్యం కల్పించాలన్నారు. లేకుంటే రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. అనంతరం పిఒ విష్ణుచరణ్‌కు వినతిని అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొల్లి గంగు నాయుడు, సాంబమూర్తి, సంచాన ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న గిరిజనులు

సమావేశంలో మాట్లాడుతున్న బాలల సంరక్షణ జిల్లా అధికారి సత్యనారాయణ

బాల్య వివాహాల నిర్మూలనలో ఎస్‌హెచ్‌జిలు కీలకం

ప్రజాశక్తి – పార్వతీపురంరూరల్

బాల్యవివాహాలను నిర్మూలించడంలో స్వయం సహాయ సంఘాల పాత్ర కీలకమని జిల్లా బాలల సంరక్షణ అధికారి అల్లు సత్యనారాయణ అన్నారు. జిల్లా సమాఖ్య సమావేశ మందిరంలో బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన సమావేశం నిర్వహించారు. జిల్లా బాలల సంరక్షణాధికారి మాట్లాడుతూ బాల్య వివాహాలు నిరోధకం చట్టం 2006 ప్రకారం అమ్మాయి వయస్సు 18ఏళ్లు, అబ్బాయి వయస్సు 21 ఏళ్లు విధిగా ఉండాలని, నిర్దేశిత వయస్సు లోపు పెళ్లి చేస్తే చట్టరీత్యా నేరమని అన్నారు. బాల్యవివాహాలను ఎవరు ప్రోత్సహించినా, పెళ్లి చేసినా లక్ష రూపాయలు జరిమానా, మూడేళ్లు జైలు శిక్ష ఉంటుందని తెలిపారు. బాల్య వివాహాలు వల్ల మహిళ ఆరోగ్యంపై ప్రభావం ఉంటుందని, ఆర్థిక, సామాజిక అనర్థాలతో పాటు అనారోగ్యాంగా పిల్లలు కలగడం జరుగుతుందని తెలిపారు. బాల్య వివాహాలు ఎక్కడ జరిగినా మహిళా సంరక్షణ కార్యదర్శి (మహిళా పోలీస్)కు లేదా పిల్లల సహాయ వాణి టోల్ ఫ్రీ నెంబర్ 1098 తెలియజేయాలని కోరారు. స్వయం సహాయక సంఘ సభ్యులు పిల్లలకు బాల్యవివా హాలు జరగకుండా ఉండాలని – ఇది మన అందరం బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. లీగల్ కం ప్రొఫెషనల్ ఆఫీసర్ పారిశర్ల శ్రీధర్ మాట్లాడుతూ పిల్లలు లేని దంపతులు ఉంటే కారా పోర్టల్ లో ఆన్లైన్ ద్వారా అప్లికేషన్ పెట్టుకుని దత్తత పొందే అవకాశం ఉందన్నారు. ఎవరైనా పిల్లలు లేని దంపతులు కారా ద్వారా కాకుండా హాస్పటల్లో గానీ, తెలిసినవారి దగ్గర నుంచి గాని పిల్లలను తీసుకున్నట్లయితే అనధికార దత్తతగా పరిగణించి వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో అసిస్టెంట్ ప్రోగ్రాం మేనేజర్ పువ్వల సురేష్, పార్వతీపురం మండల సమైఖ్య అధ్యక్షులు జగదీశ్వర్, బాలల సంరక్షణ విభాగం కౌన్సిలర్ జి.తవిటి నాయుడు, మండల స్వయం సహాయక సంఘ అధ్యక్షులు, సభ్యులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై కలెక్టర్‌కు వినతిని అందజేస్తున్న సిపిఎం నాయకులు

తాగునీటి సమస్య పరిష్కరించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

స్థానిక మున్సిపాలిటీని గత పదేళ్లుగా పట్టిపీడిస్తున్న తాగునీరు సమస్య పరిష్కరించాలని కోరుతూ సోమవారం ప్రజా సమస్య పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్‌కు సిపిఎం పట్టణ కమిటీ కార్యదర్శి గొర్లి వెంకటరమణ, కమిటీ సభ్యులు రెడ్డి శ్రీదేవి, పాకల సన్యాసిరావు, బంకురు సూరిబాబు, సంచాన ఉమాతో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మున్సిపాలిటీలో తాగునీరందించే మంచి నీటి వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమైందని, 2014 నుంచి నేటి వరకు సుమారు పదేళ్లుగా కుళాయిల ద్వారా వచ్చే తాగునీరు రంగు మారడం, ప్రతిరోజు సరఫరా చేయకపోవడం జరుగుతుందన్నారు. మున్సిపల్ అధికారులు లక్షలది రూపాయలు ప్రజాధనం ఖర్చు చేస్తున్నారు తప్ప ప్రయోజనం లేకుండాపోతుందని, ప్రజలు తాగునీటికి చాలా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. దీనికి ప్రధాన కారణం సుమారు 60 క్రితం తవ్విన నాగావళి నదిలో ఉన్న ఊటబావులు పాడై పోయాయని, వీటిని గుర్తించిన అధికారులు, పాలకులు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో ప్రభుత్వం సానుకూలంగా స్పందించి రూ.63 కోట్లతో సమగ్ర మంచినీటి పథకానికి నిధులు మంజూరు చేసినట్లు ప్రకటించిందని అన్నారు. ఇందులో భాగంగా పండావీధి చివర నుండి ఆడబడి వీధి కొంత భాగం పైపులైన్లు వేసి పనులు ప్రారంభించి అర్థాంతరంగంగా నిలిపి వేశారని అన్నారు. నిలిపి వేసిన పనులు ప్రారంభించి పట్టణ ప్రజలకు శుద్ధ జలాలను సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

వీరఘట్టంలో ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి - వీరఘట్టం

మండల కేంద్రమైన వీరఘట్టంలోని మూడో సచివాలయం పరిధిలో సోమవారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి, మధుమేహ, రక్తపోటు, జ్వర పీడితులు, చంటి పిల్లలు, వృద్ధులకు తదితరమైన వారికి వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్వైజర్ ఒ.శాంతకుమారి, ఎమ్మెల్ హెచ్పి భాగ్యరాధ, ఎఎన్ఎం రాజేశ్వరి, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

10న వాహనాలకు వేలం

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణంలో ఈ నెల 10న వాహనాలకు వేలంపాట ఉంటుందని ఎస్సై ఎస్కె ఫక్రుద్దీన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రొహిబిషన్ యాక్ట్ కేసులో పట్టుబడి సీజ్ చేసిన వాహనాలకు వేలంపాట వేనున్నట్టు తెలిపారు. ఆటో 1, స్కూటీలు 2, హీరో ఫ్యాషన్1, టివిఎస్ 50 మోపెడ్ 1కు వేలం వేయనున్నామని, ఆసక్తి గల వారు పాటలో పాల్గొనాల్సింది ఎస్సై తెలిపారు.

ఎంపిడిఒకు వినతిని అందజేస్తున్న గిరిజన సంఘం నాయకులు

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

ప్రజాశక్తి - పాచిపెంట

ఉపాధి వేతనదారులకు పెండింగ్ బిల్లులు చెల్లించాలని వ్యవసాయ కార్మికసంఘం నాయకులు కొర్ర సుబ్బారావు, సేబి రంగారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుడుమూరు రెవెన్యూ 48 సర్వేనెంబర్‌లో గల మెట్టవలస, తోక మెట్ట రెండు గిరిజన గ్రామాల్లో గిరిజనులు సాగు చేస్తున్న భూముల్లోనే పనులు కల్పించాలని కోరారు. పని చేసి సకాలంలో కూలి చెల్లించక ఇబ్బందులు పడుతున్నామన్నారు. రోజు కూలి రూ.600 చెల్లించాలని, ఒకే పూట పని పెట్టేలా చర్యలు చేపట్టాలని, 200 రోజులు పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంపిడిఒ లక్ష్మీకాంత్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు, గిరిజన సంఘం నాయకులు సూకుర్ ఎర్రయ్య, గెమ్మలి పోతయ్య, భీమయ్య, లక్ష్మణరావు, కొర్ర పోలయ్య, తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరి

ప్రజాశక్తి -పార్వతీపురం టౌన్

ద్విచక్ర వాహన ప్రయాణికులంతా తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని డిఎల్ఎస్ఎ చైర్మన్, రెండో అదనపు జిల్లా జడ్జి ఎస్.దామోదరరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జూన్ 26న డబ్ల్యూపి నంబరు (పిల్) 116/2024 పై హై కోర్టు ఉత్తర్వులు జారీ చేసిందని చెప్పారు. కావున ద్విచక్ర వాహన ప్రయాణికులంతా తప్పని సరిగా హెల్మెట్ ధరించి తద్వారా సంభవించే ప్రమాదాలను అరికట్టాలని ఆయన కోరారు.

భాషా వాలంటీర్లను రెన్యువల్ చేయాలి

ప్రజాశక్తి - సీతంపేట

పాడేరు ఐటిడిఎ మాదిరిగా ఆదివాసీ బహుభాషా వాలంటీర్లను రెన్యువల్ ఉత్తర్వులు ఐటిడిఎ మంజూరు చేయాలని ఎపిఒ గణేష్‌కు, డిడి అన్నదొరకు ఆదివాసీ బహుభాషా ఉపాధ్యాయుల సంఘం రాష్ట్రనాయకులు సవర డొంబు, ఉమ్మడి జిల్లా అధ్యక్షులు సవర ఆనందరావు, కార్యదర్శి సవర ఎల్లంగో, మండల అధ్యక్షులు సవర మాసయ్య, మహిళా అధ్యక్షులు ఎం.భారతి, సుజాత వినతిని అందజేశారు. స్థానిక ఐటిడిఎ ప్రజా సమస్య పరిష్కార వేదికలో వినతిని అందజేశారు. అలాగే ఊయక చెల్లమ్మ వితంతు పెన్షన్ ఇప్పించాలని కోరారు. కోనంగికి చెందిన అశోక్ కుమార్ కిరణ్‌షాపు రుణం ఇప్పించాలని విన్నవించారు. భామినికి ఇఎంఆర్ఎస్ పాఠశాలలో ఔట్సోర్సింగ్ లేక గెస్ట్ ఉపాధ్యాయ పోస్టు ఇప్పించాలని విన్నవించారు. మార్క్యాపురం చెందిన సుందరమ్మ స్ప్రేయర్ ఇప్పించాలని కోరారు. కుంబికి చెందిన రామారావు, వ్యవసాయ బోరు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ ఇఇ సింహాచలం, డిప్యూటీ డిఇఒ పాలకనారాయుడు, సిడిపిఒ రంగ లక్ష్మి, స్పోర్ట్స్ ఇంచార్జ్ జాకబ్ దయానంద్, ఎస్ఎంఐ డిఇ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు అవగాహన

ప్రజాశక్తి -పార్వతీపురం టౌన్

పట్టణంలోని కొత్తవలసలో కౌలు రైతులతో అవగాహన సదస్సును స్థానిక తహశీల్దార్ కె.ఆనందరావు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌలు రైతులకు కౌలు కార్డు ద్వారా పంట భీమా, పంటకు రక్షణ సదుపాయం కలదని, భవిష్యత్ లో ఎటువంటి విపత్తులు వచ్చినా మేలు కలుగుతుందని తెలిపారు. అలాగే సకాలంలో ఎరువులు మార్కెట్ ధరలకే పొందగలరని,.రైతు భరోసా పథకం ద్వారా ఆర్థిక భరోసా లభిస్తుందని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విఆర్ఒ రాజు, కౌన్సిలర్ నారాయణ రావు, పలువురు కౌలు రైతులు పాల్గొన్నారు.

తహశీల్దార్‌ను కలిసిన జనసేన నాయకులు

ప్రజాశక్తి - సీతంపేట

మండల జనసేన అధ్యక్షులు మండంగి విశ్వనాథం ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు స్థానిక తహశీల్దార్ మహేశ్వరరావును సోమవారం కలిశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ మండలంలోని భూ పట్టాలు, వాటి రికార్డులకు సంబంధించిన విషయాలపై దృష్టి సారిస్తామన్నారు. దీని కోసం గ్రామ, పంచాయతీ స్థాయిలో పర్యటించి సమావేశాలు ఏర్పాటు చేసి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

ఘనంగా వైఎస్ఆర్ జయంతి

ప్రజాశక్తి -సాలూరు

కీర్తిశేషులు వైఎస్ రాజశేఖరరెడ్డి 75వ జయంతి సందర్భంగా బోసు బొమ్మ జంక్షన్ లో ఉన్న వైఎస్ విగ్రహానికి మాజీ డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర పాలాభిషేకం చేసి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వైసిపి నాయకులు కార్యకర్తలు అభిమానుల సమక్షంలో బర్త్ డే కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మ వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి డోల బాబ్జీ, జిల్లా మహిళా విభాగం అధ్యక్షులు రెడ్డి పద్మావతి, సీనియర్ నాయకులు దండి శ్రీనివాసరావు మాట్లాడారు. జెసిఎస్ కన్వీనర్ గిరిరఘు, కౌన్సిలర్లు గొర్లి వెంకటరమణ, జి.నాగేశ్వరరావు, వైసిపి నాయకులు హరి బాలాజీ, ఎం.అప్పారావు, కొల్లి వెంకటరమణ, గిరి చిన్ని దొర, వైస్ ఎంపిపి రెడ్డి సురేష్, మాజీ వైస్ ఎంపిపి బి.గౌరీశ్వరరావు పాల్గొన్నారు.

జర్జాపు సోదరులు దుమ్మ

వైఎస్సార్ జయంతి వేడుకలో వైసిపి జిల్లా కార్యదర్శి జర్జాపు సూరిబాబు, మాజీ అర్బన్ బ్యాంక్ అధ్యక్షులు జర్జాపు ఈశ్వరరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, జర్జాపు దీప్తి పాల్గొనలేదు. వీరితోపాటు సుమారు 12 మంది కౌన్సిలర్లు కూడా గైర్హాజరయ్యారు.

పార్వతీపురం టౌన్ : మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి 75వ జయంతిని పురస్కరించుకుని పట్టణంలోని ఆర్‌టిసి కూడలి వద్ద గల వైఎస్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. పార్టీ శ్రేణులతో కలిసి రైతు బజార్ ఎదురుగా గల నిరాశ్రయుల వసతి గృహంలో వృద్ధులకు, వికలాంగులకు, అనాథలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఎంపిపిలు మజ్జి శోభారాణి, గుడివాడ నాగమణి, బలగ రమణమ్మ, శ్రీరాములు నాయుడు, జడ్పిటిసిలు బలగ రేవతమ్మ, మామిడి బాబ్జీ, అలజంగి రవికుమార్, మున్సిపల్ వైస్ చైర్పర్సన్ బోను గౌరీశ్వరి, వైస్ చైర్పర్సన్ కొండపల్లి రుక్మిణి, మూడు మండలాలు, మున్సిపల్ వైసిపి అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, పలువురు సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కురుపాం : కీర్తిశేషులు వైఎస్ రాజశేఖరరెడ్డి 75వ జయంతి వేడుకలు పురస్కరించుకొని కురుపాంలోనిరావాడ జంక్షన్ వద్ద ఉన్నటువంటి వైయస్సార్ విగ్రహానికి ఎంపిపి శెట్టి పద్మావతి, జెడ్‌పిటిసి జి.సుజాత పాలాభిషేకం చేసి పూలమాలలు వేసి నివాళులర్పించి కేక్ కట్ చేశారు. అనంతరం వైసిపి సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు, రొట్టె, పాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా కొప్షన్ సభ్యులు షేక్ నిషార్, వైస్ ఎంపిపి రంగారావు,మండల కొప్షన్ సభ్యులు షేక్ జిలాని, స్థానిక సర్పంచ్ జి. సుజాత, ఉపసర్పంచ్ షేక్ ఆదిల్, వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి శెట్టి నాగేశ్వరరావు, వైసిపి వాణిజ్య విభాగాల జిల్లా అధ్యక్షులు అంధవరపు కోటేశ్వరరావు, ఎంపిటిసిలు వి.బంగారునాయుడు, స్వామి యోజులు, వైసిపి నాయకులు షేక్ నూరేష్, జి.విజయ్ పాల్గొన్నారు.

పాలకొండ : కీర్తిశేషులు వైఎస్ రాజశేఖర్ రెడ్డి 75వ జయంతి సందర్భంగా కాల్వల జంక్షన్ దగ్గర గల వైసి విగ్రహానికి ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే కళావతి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పట్టణ వైసిపి అధ్యక్షులు వెలమల మన్మధరావు, మున్సిపల్ చైర్పర్సన్ యందవ రాధా కుమారి, ఎంపిపిలు డి.వెంకటరమణ, భాను, వైస్ ఎంపిపిలు కనపాక సూర్యప్రకాష్, వాకమూడి అనిల్, దుప్పాడ పాపినాయుడు, లిల్లీ పుష్పనాథం, కడగల రమణ, భాసూరు కాంతారావు, కిల్లారి మోహన్ తదితరులు ఉన్నారు.

గుమ్మలక్ష్మీపురం : రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ ఆవరణలో గల వైఎస్ విగ్రహానికి ఎంపిపి కె.దీనమయ్య పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో జడ్పిటిసి రాధిక, రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి నిమ్మక గోపాల్ , పలువురు సర్పంచులు, ఎంపిటీసీలు నాయకులు పాల్గొన్నారు.

జియ్యమ్మవలస : మండలంలోని పెదమేరంగి కూడలిలో గల వైఎస్ విగ్రహానికి మాజీ మంత్రి పి.పుష్ప శ్రీవాణి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పలువురు వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వీరఘట్టం :మండలంలోని తెట్టంగిలో ఎఎంసి ఉపాధ్యక్షులు పొట్నూరు లక్ష్మణరావు వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో సర్పంచి అలజంగి విజయమ్మ, ఎంపిటిసి సతివాడ సత్యంనాయుడు, మాజీ ఎంపిటిసి పొట్నూరు పరిశినాయుడు, కార్యకర్తలు ,అభిమానులు పాల్గొన్నారు.

భామిని: మండలం లోని కొరమ కూడలి వద్ద వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి వైసిపి నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ తోట సింహాచలం, వైస్ ఎంపిపి బోనగడ్డి ధర్మారావు, సర్పంచులు మజ్జి మోహన్‌బాబు, అగుతముడి రఘు, తోఫురానా శ్రీను, నిమ్మల కేశవ, కిల్లారి పాల్గుణరావు, జెడ్‌పిటిసి బొడ్డేపల్లి

వైఎస్ విగ్రహానికి పూలమాల వేస్తున్న రాజన్నదొర

ప్రసాదరావు, బిడ్డిక తమ్మారావు, పలువురు వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీతానగరం : సీతానగరంలో రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి నాయకులు పూలమాలవేసి ఘనంగా నివాళు లర్పించారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి బలగ శ్రీరాములునాయుడు, జడ్పిటిసి మామిడి బాబ్జీ, మాజీ ఎమ్మెల్యే సవరపు జయమణి, నాయకులు రామారావు, పిఎసిఎస్ చైర్మన్ కూర్మారావు, ఆర్‌వి, పలువురు ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు, శంకరపు వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట : స్థానిక బస్టాండ్ వద్ద గల వైఎస్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే వి.కళావతి పూలమాలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏరియా ఆసుపత్రిలో రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిపి ఆదినారాయణ, వైస్‌ఎంపిపి సరస్వతి, విజయలక్ష్మి, సర్పంచులు కళావతి, ఆదిలక్ష్మి, ఎఎంసి చైర్మన్ మోహన్‌రావు, నాయకులు నిమ్మక కాంతారావు, కొండగొర్రె భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

మక్కువ : స్థానిక వైసిపి కార్యాలయంలో ఆ పార్టీ మండల అధ్యక్షులు మావుడి రంగు నాయుడు ఆధ్వర్యంలో రాజశేఖర్ రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో మండలంలోని పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


పాలకొండ : వైఎస్‌కు నివాళ్లు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ


పార్వతీపురం: మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జోగారావు


జియ్యమ్మవలస : వైఎస్ విగ్రహానికి పూలమాల వేస్తున్న పుష్పశ్రీవాణి

వీరఘట్టం : వైఎస్‌కు నివాళ్లు అర్పిస్తున్న నాయకులు

చిరుద్యోగులపై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలి

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

చిరు ఉద్యోగులపై కక్షసాధింపు చర్యలు మానుకోవాలి సిఐటియు జిల్లా కార్యదర్శి వై.మన్మధ, శ్రామిక మహిళా నాయకులు వి. ఇందిర అన్నారు. సోమవారం స్థానిక సుందరయ్య భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ పార్టీ నాయకులు కిందిస్థాయి చిరు ఉద్యోగస్తులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం దురదృష్టకరమన్నారు. జియ్యమ్మవలస ఎంపిపి బొంగు సురేష్ ఫీల్డ్ అసిస్టెంట్లపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతూ మండల పరిషత్ కార్యాలయంలో తన ఛాంబర్‌కు పిలుపుంచుకొని దుర్భాసలాడారన్నారు. జూన్ 30న జోగులుడుమ్మ పంచాయతీ ఫీల్డ్‌అసిస్టెంట్ బూర్ల నాగమణి మహిళలను చూడకుండా మానసికంగా వేధిస్తూ నీకు నువ్వుగా రాజీనామా చేయాలని, లేని పక్షంలో నీకు ఇబ్బందులు తప్పవని బూతులు తిడుతూ మానసికంగా వేధిస్తున్నారని అన్నారు. శిగబడి ఫీల్డ్ అసిస్టెంట్ ఎర్ర సింహాచలంను బలవంతంగా రాజీనామా చేసినట్టు తన ఛాంబర్‌లో సంతకం పెట్టించడం దారుణమని అన్నారు. ఇలాంటి కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని హితవు పలికారు. అనంతరం సుందరయ్య భవనం నుంచి కలెక్టరేట్ వరకూ ర్యాలీగా వెళ్లి అక్కడ కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. వినతిని అందజేసిన వారిలో సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ, ఫీల్డ్ అసిస్టెంట్ యూనియన్ అధ్యక్షులు హరినాథ్, పలువురు ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం

ర్యాలీ చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు, సిఐటియు నాయకులు

యాప్‌పై విఒఎలకు శిక్షణ

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా మహిళా సంఘాల పనితీరు, సంఘాల బలోపేతం, ప్రభుత్వ పథకాల లబ్ధి ఇలా పలు అంశాలపై విఒఎలు తమ రికార్డులను మండల స్థాయిలో సమర్పించేవారు. అయితే ఈ కార్యక్రమం ఒక్క రాష్ట్రం మేరకే పరిమితం కాకుండా ఇప్పుడు లోక్ ఒఎస్ యాప్ ద్వారా కేంద్ర ప్రభుత్వం పరిధి వరకు వ్యాపించేలా ఈ యాప్‌లో ప్రజల జీవనోపాధి, ప్రభుత్వ ఫలాల లబ్ధి మొదలైన పథకాలను సమీక్షించి గ్రామస్థాయిలో ఉన్న సంఘాల్లో ఇప్పటి వరకు ఆయా గ్రామాలు విడిచి వేరొక ప్రాంతాల్లో స్థిరపడ్డారో, అలాగే చనిపోయిన వారి పేర్లు కూడా తొలగించి కొత్త నిబంధనలు మేరకు ఈ యాప్ ద్వారా శిక్షణ అందిస్తున్నట్లు ఐబి ఎపిఎం జయమ్మ ఎల్.సత్యనారాయణ తెలిపారు.

టికె జమ్ములో వైద్య శిబిరం

జియ్యమ్మవలస : మండలంలోని తామరకండిజమ్ములో రావాడ రామభద్రపురం పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ సిహెచ్ శంకరరావు ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గ్రామంలోని 281మందికి, అలాగే స్థానిక ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. జ్వరాలతో ఉన్న 8 మందికి చికిత్స అందించారు. అనంతరం గ్రామస్తులకు వ్యక్తిగత పారిశుధ్యం, దోమతెరల వాడకం, వైరల్ ఫీవర్ల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యాధికారి శృతి, సర్పంచ్ అడ్డాకుల భారతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న సిడిపిఒ సుశీలాదేవి

చట్టాలపై బాలికలకు అవగాహన తప్పనిసరి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

బాలికలపై జరుగుతున్న లైంగిక వేధింపుల నిరోధక చట్టాలను ప్రతి యువత అవగాహన పరుచుకొని సమాజంలో బాల బాలికలు తలఎత్తుకొని తిరిగేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని భద్రగిరి ఐసిడిఎస్ సిడిపిఒ సిహెచ్.సుశీల దేవి, కురుపాం సిడిపిఓ కె.విజయగౌరి, ఎల్విన్‌పేట ఎస్ఐ బి.శివప్రసాదరావు కోరారు. సోమవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన బాలికల లైంగిక వేధింపుల అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. నేటి సమాజంలో జరుగుతున్న బాలికలు, యువతులపై వేధింపులు ఆత్మహత్యాయత్నాలు, బలమరణాలు తదితర వాటిపై యువతులకు అవగాహన కల్పించాలని అన్నారు. రోడ్డుపై వెళ్తున్న బాలికలపై జరుగుతున్న అకృత్యాలు అరికట్టాలంటే 1090 నెంబర్ కు కాల్ చేసి రక్షణ పొందేలా అవగాహన ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. ఈ మేరకు ఇటువంటి చట్టాలు పోలీసు శాఖ అందిస్తున్న నెంబర్లను యువతులు గుర్తించుకొని ఎక్కడైనా ఎప్పుడైనా అటువంటి సంఘటనలు జరిగిన వెంటనే ఆయా నెంబర్లకు కాల్ చేసి స్వయం రక్షణ పొందాలని సూచించారు. అంతేకాక దిశ యాప్‌లను కూడా డౌన్లోడ్ చేసుకొని రక్షణ పొందేలా చూసుకోవాలన్నారు. మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టుకునేందుకు స్వయం రక్షణ కృత్యాలను యువతలంతా నేర్చుకోవాలని అన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రభుత్వా డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ డి.రామయ్య, మహిళా అధ్యాపకులు కల్పన, తులసి, డాక్టర్ ఎన్.శాంత, ఎన్ఎస్ఎస్ పిఓ త్రినాధ, ఆర్ఐ పి.గిరిబాబు, ఐసిడిఎస్ సూపర్వైజర్లు శ్రీదేవి, ఈశ్వరమ్మ, దవులత్ వున్నేసా, అపర్ణ, రేవతి తదితర అధ్యాపకులు పాల్గొన్నారు.

నారుమళ్లలో సూక్ష్మపోషకాలు అవసరం

ప్రజాశక్తి - పాచిపెంట

పత్తి, వరి నారుమళ్లలో సూక్ష్మపోషకాల సవరణ అతి ప్రధానమైనందని మండల వ్యవసాయాధికారి కె.తిరుపతిరావు అన్నారు. మండలంలోని పాంచాలి, మాతుమూరులోని రైతు సేవ కేంద్రాల పరిధిలో గల పత్తి, వరి పంటలను పరిశీలించిన అనంతరం రైతులతో మాట్లాడారు. ప్రస్తుతానికి మండలంలో వరి నారు ఆరోగ్యకరంగా ఉందన్నారు. మూడు రోజుల నుండి పది రోజుల వయసు నారుమడులు ఉన్నాయన్నారు. అలాగే పత్తి 30 నుంచి 45 రోజుల వయసు మధ్యలో ఉందని ప్రస్తుతానికి అక్కడక్కడ పచ్చదోమ కనిపిస్తుందని, పంటలో కేవలం స్థూల పోషకాలు మాత్రమే కాకుండా సూక్ష్మ పోషకాలు కూడా వాడాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. వరి నారుమడుల్లో పసుపు రంగుకు మారినట్లయితే జింక్ లోపంగా గమనించి చిలామిన్ జింక్ రెండు గ్రాములు ఒక లీటరు నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలన్నారు. అలాగే పత్తిలో రసం పీల్చు పురుగుల నివారణకు ఇమిడా క్లోప్రిడ్ లేదా అసిటా మిప్రిడ్ లేదా తయోమెతాగ్జామ్‌లో ఒకదాన్ని లీటరు నీటికి 0.6 గ్రాములు కలిపి పిచికారీ చేసుకోవాలని తెలిపారు. తెగుళ్ల సమస్యలపై తప్పనిసరిగా రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలని రైతులకు సూచించారు. అలాగే పత్తి పంటలో కలుపు మందుల వినియోగాన్ని తగ్గించి ఎద్దుల ద్వారా గానీ, మనుషుల ద్వారా గానీ, యంత్రాల సాయంతో కలుపు నివారణ చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో విఎఎలు ఈదుబిల్లి శ్రీను, బంటు దినేష్ పాల్గొన్నారు.

రైతులకు ఎరువులు పంపిణీ

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని నారాయణపురంలో సోమవారం స్థానిక ఎమ్మెల్యే విజయచంద్ర రైతులకు ఎరువులను అందజేశారు. మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రావణ్ కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు రైతులకు సరైన సమయంలో రైతు సేవా కేంద్రం ద్వారా పంపిణీ చేస్తామన్నారు. అలాగే ధాన్యం కొనుగోలు కేంద్రం ద్వారా ప్రతి గింజ కొనుగోలు చేయించేలా చర్యలు తీసుకుంటామన్నారు. సాగునీటికి ఇబ్బంది లేకుండా కెనాల్ ఇరిగేషన్ ద్వారా పంట పొలాలకు రెండుసార్లు నీటి సరఫరా చేసేలా ప్రయత్నిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు పెంకి వేణుగోపాలనాయుడు, మాజీ సర్పంచ్ మండల పాపి నాయుడు, మాజీ జడ్పీటీసీ రాధ, అరకు పార్లమెంటరీ బిసి సెల్ అధ్యక్షులు బూరాడ రవి, మజ్జి అప్పారావు, పలువురు సర్పంచులు, నాయకులు, మండల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

సీతానగరం : మండలంలోని చినభోగిలిలో ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర చేతులమీదుగా మండల వ్యసాయాధికారి ఎస్.అవినాష్ అధ్యక్షతన ఎరువుల పంపిణీ చేశారు. తొలుత ఎమ్మెల్యేకు స్థానిక నాయకులు చినబోగిలి రోడ్డు నుండి సభా ప్రాంగణం వరకు ఎడ్లబండ్లపై ర్యాలీ నిర్వహించి ఘన స్వాగతం పలుతారు. కార్యక్రమంలో అనంతరం సీతానగరం జిల్లా పరిషత్ పాఠశాలను ఆకస్మికంగా పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ, డిటి, మండల టిడిపి అధ్యక్షులు పెంట సత్యంనాయుడు, ప్రధాన కార్యదర్శి వేణు, జిల్లా పార్టీ కన్వీనర్ గొట్టాపు వెంకటనాయుడు, విద్యుత్‌శాఖ ఎఇ, పలువురు మండల అధికారులు, సర్పంచులు, విఎఎలు, రైతులు పాల్గొన్నారు.

సీతానగరం : ఎమ్మెల్యేకు ఎడ్ల బండిపై స్వాగతం పలుకుతున్న రైతులు, నాయకులు

ప్రమాదం జరిగితే గానీ స్పందించరా?

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

స్థానిక పాత బస్టాండ్ కూడలి వద్ద ఏదైనా జరగరాని ప్రమాదం సంభవిస్తేగాని పోలీసులు, మున్సిపాలిటీ అధికారులు స్పందించరా అని పట్టణ ప్రజలు బహిరంగంగానే విమర్శలు గుప్పిస్తున్నారు. స్థానిక పాత బస్టాండ్ వద్ద ఇటు రాయగడ రోడ్డకు, ఇటు శ్రీకాకుళంకు వెళ్లే రహదారి కూడలి ప్రాంతంలో గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే కూరగాయల వ్యాపారులు ప్రతిరోజూ తాము తెచ్చే కూరగాయలను ఈ రహదారి కూడలిలో విక్రయిస్తుంటారు. అయితే ఈ కూడలిలో భారీ వాహనాల రాకపోకల వల్ల ద్విచక్ర, వాహనదారులు, పాఠశాలలతో పాటు, కాయగూరలు విక్రయాలు చేసే వారికి, కొనుగోలు చేసే వారికి ఎప్పుడు ఏం ప్రమాదం సంభవిస్తుందోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ఈ విషయంపై అటు పోలీస్, ఇటు మున్సిపల్ అధికారులు దృష్టి సారించి ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. లేకుంటే ప్రమాదాలు జరిగే సంఘటనలు ఎక్కువని ఆందోళన చెందుతున్నారు.

మార్కెట్ మీదుగా వెళ్తున్న భారీ వాహనాలు

రోడ్డు ఆక్రమించి మొక్కలు పెంపకం

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

పట్టణానికి చెందిన పలువురు ప్రముఖ వృత్తిలో సేవ చేస్తూ, పలువురికి ఆదర్శంగా ఉండాల్సిన ప్రముఖులు వరహాల గెడ్డ గట్టును, ఆర్ అండ్ బి రోడ్డును ఆక్రమించి పర్యావరణ పరిరక్షణ చేస్తూ పట్టణానికి ఆదర్శంగా నిలుస్తున్నామని చెప్పుకుంటున్న వైనం చూస్తున్న పట్టణ ప్రజలు ఇదేమి చోద్యమని ఆశ్చర్యపోతున్నారు. ఇటీవల ప్రభుత్వ మారడంతో ఆక్రమణలను తొలగించేందుకు మున్సిపల్, రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టడంతో వరహాలగెడ్డపై ఉన్న ఆక్రమణలను తొలగించడం హర్షించిదగిన విషయమే. అయితే పట్టణానికి చెందిన ఓ ప్రముఖ వ్యక్తికి సంబంధించి ప్రధాన రహదారి పక్కనే ఉన్న రెండు ఖాళీ స్థలాల్లో నిర్మాణ పనులు చేయకుండానే తన ఖాళీ స్థలం ముందున్న ఆర్‌అండ్‌బి రోడ్డును ఆక్రమించి మొక్కల వేసి ఫెన్సింగ్ కూడా ఏర్పాటు చేశారు. దీంతో అదే రోడ్డు గుండా ప్రతిరోజు వందలాది భారీ వాహనదారులు, ద్విచక్ర వాహన చోదకులు రాకపోకలు సాగిస్తుండడంతో ఈ మొక్కలు నాటిన ప్రాంతంలో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడడమే కాక, ఏదో ఒక సందర్భాల్లో వాహన చోదకులు ప్రమాదాల బారిన పడే సందర్భాలు ఉన్నాయి. దీంతో పాటు బెలగాంలో ఉన్న ఏరియా ఆసుపత్రి కూడలిలో నిర్మిస్తున్న మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణ పనులు జరుగుతున్నప్పటికీ, ఆ ఆసుపత్రి ప్రధాన రహదారి పక్కనే కోర్టుల వద్ద ఇంత జరుగుతున్నా అటు ఆర్‌అండ్‌బి అధికారులు గానీ, ఇటు మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు గానీ చర్యలు చేపట్టకపోవడంతో పట్టణ ప్రజలు సంబంధిత అధికారులపై బహిరంగంగానే విమర్శలు గుప్పిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు అర్‌అండ్‌బి రోడ్డుపై వేసిన మొక్కలను తొలగించి ప్రధాన రహదారిపై ట్రాఫిక్ కష్టాలు తొలగించేందుకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్డును ఆక్రమించి వేసిన మొక్కలు